క్లుప్తంగా

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సామాజిక కార్యకర్త

దహెగాం: మండలంలోని కుంచవెల్లి గ్రామానికి చెందిన గౌరె అనిల్ అనే వ్యక్తి గత ఏడు నెలల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి పడడంతో నడుము భాగం దెబ్బతిని మంచానికే పరిమితమయ్యాడు. దీంతో పెంచికల్‌పేట్ మండలం బొంబాయిగూడ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్తలు చప్పిడి ప్రకాశ్, చౌదరి గుండయ్యలు బుధవారం బాధితుడికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

జైనూర్‌లో..



ఆర్థిక సాయం అందజేస్తున్న హన్ను పటేల్

జైనూర్: ఆపదలో ఉన్న వారికి చేయూతనివ్వడమే మానవ ధర్మమని సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని దుబ్బగూడ గ్రామంలో కుష్టువ్యాధితో బాధపడుతున్న కుర్సెంగ చిత్రుకు రూ.12000ల ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆత్రం సక్కులు సాయం అందించినట్లు తెలిపారు. మడావి భీంరావు, భగవంత్‌రావు ఉన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రం



ఎల్కపల్లి వారసంతలో టాయిలెట్స్ శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ టాయిలెట్స్‌పై సోమవారం సాక్షిలో కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి కుకిడే చంద్రశేఖర్ బుధవారం పంచాయతీ సిబ్బందితో టాయిలెట్స్‌లోని చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేయించారు. మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ ఆవరణ, వారసంతలోని పబ్లిక్ టాయిలెట్స్‌ను వినియోగంలోకి తీసుకొస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'జర్నలిస్టుపై దాడి చేసిన వారిని శిక్షించాలి'

బెజ్జూర్: కాగజ్‌నగర్ పట్టణంలో జర్నలిస్టు అంగల తిరుపతిపై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ శ్రీమాన్‌కు, తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అచ్యుత్ రావుకు వినతిపత్రం అందజేశారు.

వాంకిడి: జర్నలిస్టు తిరుపతిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ ఎమ్ఎల్ రెడ్ స్టార్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగర్ల తిరుపతి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చారిగాం గ్రామ శివారులో అక్రమంగా మైనింగ్ పనులు చేపడుతుండగా ఫొటోలు తీయడానికి వెళ్లిన తిరుపతిపై దారుణంగా దాడి చేయడం సరికాదన్నారు. అక్రమార్కులకు అండగా నిలుస్తున్న అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'విధుల్లో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదు'

నార్నూర్: మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలు సద్వినియోగం చేసుకునేలా సీసీలు, వీవోఏలు చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదని డీఆర్డీవో సాయన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీవోఏలు, సీసీలు, ఏపీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. అవి ప్రతీ మహిళకు అందేలా చూడాల్సిన బాధ్యత గ్రామస్థాయి సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వం అందించే రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తొలిసారిగా మండలానికి వచ్చిన డీఆర్డీవోను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నీలేష్, ఎంపీడీవో జవహర్, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

పూడికతీత పనులు పరిశీలన

నార్నూర్: మండలంలోని గుండాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన కాలువ పూడికతీత పనులను డీఆర్డీవో సాయన్న పరిశీలించి టీఏ జాదవ్ కైలాస్‌ను అభినందించారు.

నిరుపయోగంగా వైకుంఠధామాలు

- దారి సౌకర్యం లేక వినియోగంలోకి రాని వైనం
- వాగు ఒడ్డున అంతిమ సంస్కారాలు
- డంపింగ్‌యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లకూ దారి సమస్య
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



దారి సౌకర్యం లేక నిరుపయోగంగా లక్ష్మీపూర్ వైకుంఠధామం

రెబ్బెన: గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం పల్లెల్లో డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లతో పాటు అంతిమ సంస్కారాల నిర్వహణకు వైకుంఠధామాలు నిర్మించింది. వీటి నిర్మాణానికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను అధికారులు కేటాయించారు. అయితే వాటిని చేరుకోవడానికి దారి సౌకర్యం కల్పించకపోవటంతో లక్షలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి.

నిర్మించి వదిలేశారు..

మండలంలోని గంగాపూర్ పంచాయతీ పరిధిలో సుమారు 2300 వరకు జనాభా ఉండగా, లక్ష్మీపూర్ పంచాయతీలో 1200 వరకు జనాభా ఉన్నారు. రెండు పంచాయతీలకు మంజూరైనా వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డుల నిర్మాణం కోసం గంగాపూర్ శివారులో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. ఒక్కో పంచాయతీకి ఎకరం చొప్పున స్థలం కేటాయించగా రూ. 12 లక్షలతో వైకుంఠధామం, రూ. 2 లక్షల వ్యయంతో సెగ్రిగేషన్ షెడ్లు, ఉపాధిహామీ నిధులతో డంపింగ్ యార్డులు నిర్మించారు. అయితే వాటిని చేరుకునేందుకు దారి సౌకర్యం లేకపోవటంతో నిరుపయోగంగా మారాయి.

వాగులే దిక్కు..

గంగాపూర్, లక్ష్మీపూర్ పంచాయతీలకు వైకుంఠధామాలు ఉన్నా దారి సౌకర్యం లేకపోవడంతో అంతిమ సంస్కారాల నిర్వహణకు గ్రామానికి ఆనుకొని ఉన్న వాగులే దిక్కుగా మారాయి. భూమి ఉన్న ప్రజలు తమ కుటుంబ సభ్యుల అంతిమ సంస్కారాలను సొంత భూముల్లో నిర్వహిస్తుండగా భూమి లేని వారు వాగును ఆశ్రయిస్తున్నారు. వాగు ఒడ్డున దహన సంస్కారాలు చేపడుతున్నారు.

రోడ్డు పక్కనే చెత్త..

ఆయా గ్రామాల నుంచి ట్రాక్టర్లలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు, సెగ్రిగేషన్ షెడ్డుకు తీసుకెళ్లేందుకు దారి లేకపోవడంతో చెత్తాచెదారాన్ని రోడ్డు పక్కన ఖాళీ స్థలాల్లో పడేసి నిప్పంటిస్తున్నారు. దీంతో అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు వీలుగా నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి.

పట్టించుకోని అధికారులు

వైకుంఠధామానికి వెళ్లేందుకు కావాల్సిన దారి మధ్యలో ఒక రైతుకు చెందిన పట్టాభూమి ఉండటంతో అందులో నుంచి వెళ్లేందుకు రైతు ఒప్పుకోవడం లేదు. రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని రైతుతో మాట్లాడి దారి ఏర్పాటులో కోల్పోతున్న పట్టా భూమికి బదులు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని అప్పగించి దారి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. మిగులు ప్రభుత్వ భూమిని కాస్తు చేసుకుంటున్న రైతులతో మాట్లాడి వైకుంఠధామాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలంటున్నారు.

దారి ఏర్పాటు చేయాలి



గంగాపూర్‌తో పాటు లక్ష్మీపూర్ పంచాయతీ పరిధి ప్రజల కోసం వాగు ఒడ్డున నిర్మించిన వైకుంఠధామాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలి. దారి మధ్యలో పట్టా భూమి ఉండటంతో వైకుంఠధామాలకు వెళ్లేందుకు రైతు ఒప్పుకోవడం లేదు. అధికారులు చొరవ తీసుకొని సంబంధిత రైతుతో మాట్లాడి ఒప్పించాలి. – శంకర్, గంగాపూర్

వినియోగంలోకి తీసుకురావాలి



లక్ష్మీపూర్, గంగాపూర్ రెండు గ్రామ పంచాయతీల కోసం రెవెన్యూ అధికారులు చూపించిన స్థలాల్లో వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డులు నిర్మించాం. పనులు పూర్తయ్యి ఏళ్లు గడుస్తున్నా నేటికీ వాటికి దారి సౌకర్యం కల్పించలేదు.

– కోలే శ్యాంరావు, మాజీ సర్పంచ్, లక్ష్మీపూర్

పట్టించుకోవడం లేదు



వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్, డంపింగ్‌యార్డుల పనులు పూర్తయినా దారి లేకపోవటంతో నిరుపయోగంగా మారాయి. రెవెన్యూ అధికారులు దారి సమస్యకు పరిష్కారం చూపాలి. లేకుంటే నిర్మాణానికి వెచ్చించిన లక్షల ప్రజాధనం వృథా అవుతుంది.– ఇగురపు సంజీవ్, గంగాపూర్

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి



కాగజ్‌నగర్‌రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

తిర్యాణి: జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిర్యాణి రేంజ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో జీవ వైవిధ్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అడవులు, జీవరాశుల సంరక్షణకు పాటుపడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రేంజ్ పరిధిలోని సెక్షన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా బుధవారం కాగజ్‌నగర్ అటవీశాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని పలు వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫారెస్టు కార్యాలయ ఆవరణలో మామిడి మొక్క నాటారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో అప్పలకొండ, ఎఫ్ఆర్‌వో రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



కెరమెరి: ఝరిలో కొనసాగుతున్న ర్యాలీ

కెరమెరి: పర్యావరణ కాలుష్యంతో జీవవైవిధ్యం దెబ్బతింటుందని రిటైర్డ్ వ్యవసాయాధికారి ఎస్. రాజయ్య అన్నారు. బుధవారం మండలంలోని మోడి గ్రామంలో ఆశ్రమ పాఠశాలలో జీవవైవిధ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శ రైతు కేంద్రె బాలాజీ, మాజీ సర్పంచ్ న్యానేశ్వర్, రైతులు దస్తగిరి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

పంచాయతీల్లో ప్రగతి పనుల పరిశీలన

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ, కమ్మర్‌గాం, నందిగామ గ్రామాల్లో ప్రగతి పనులను బుధవారం ఎంపీడీవో అల్బర్ట్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పనులు, నర్సరీలు, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండలు మండిపోతున్న నేపథ్యంలో మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో కూలీలకు అందిస్తున్న పని దినాలను అడిగి



కూలీల హాజరు పరిశీలిస్తున్న ఎంపీడీవో అల్బర్ట్

తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో గంగాసింగ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

చెరువులో విషప్రయోగం

బెజ్జూర్: చెరువులో విషప్రయోగం జరిగి చేపలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని అందుగులగూడ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అందుగులగూడ గ్రామంలో గల మాయలమ్మ చెరువును గత వర్షాకాలంలో తలండి బలరాం లీజుకు తీసుకొని చేపలు పెంచుతున్నాడు. రూ.50వేల పెట్టుబడితో చేపపిల్లలను చెరువులో వేశాడు. ప్రస్తుతం ఒక్కో చేప సుమారు కిలోకు పైగా ఉండగా వాటిని విక్రయిస్తూ బతుకుదెరువు కొనసాగిస్తున్నాడు. కాగా మంగళవారం బలరాం చెరువు వద్దకు వెళ్లి చూసే సరికి కొన్ని చేపలు చనిపోయి ఉన్నాయి. ఏం జరిగిందో అయనకు అర్థం కాలేదు. బుధవారం ఉదయం సైతం మరికొన్ని చేపలు మృతిచెంది ఉన్నాయి. ఎవరో చెరువులో విషప్రయోగం చేశారని, దీంతోనే చేపలు మృతిచెందాయని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా చెరువులో విషప్రయోగం జరిగిన ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కౌటాలలో..

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామ సమీపంలో గల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు



కౌటాల: మొగడ్‌దగడ్ గ్రామసమీపంలోని చెరువులో మృతి చెందిన చేపలు

విష ప్రయోగం చేయడంతో బుధవారం చెరువులోని చేపలు మృతి చెందినట్లు మత్స్యకారుడు ఎర్మ సుధాకర్ తెలిపారు. గతేడాది చెరువులో రూ. 50 వేల విలువ గల చేప పిల్లలు వేసినట్లు పేర్కొన్నాడు. చేపలు పెరగడంతో ఈ వారంలో చేపలు పట్టాలనుకున్నామని, ఇంతలో ఎవరో విష ప్రయోగం చేయడంతో చెరువులోని అన్ని చేపలు మృతి చెందాయని వాపోయాడు. చేపలు అన్ని మృతి చెందడంతో రూ.లక్ష నష్టం జరిగిందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. చెరువులో విష ప్రయోగం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

క్రీడాకారిణికి సన్మానం

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్ బేస్‌బాల్ క్రీడాకారిణి అగాడి స్ఫూర్తిని బుధవారం మండల ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. క్రీడాకారిణి స్ఫూర్తి సాఫ్ట్ బేస్‌బాల్ క్రీడలో జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఇటీవల నేపాల్‌లో నిర్వహించిన పోటీలలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించారు. సంఘం నాయకులు బొజ్జ హరిక్రిష్ణ, అగాడి నారాయణ, దుర్గం శంకర్, పెరుగు పంచాక్షర్, చౌదరి హరి, చాప్లె అంజన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.



సన్మానం చేస్తున్న పీఎంపీ, ఆర్ఎంపీ సంఘం సభ్యులు

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

వాంకిడి: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి జాడి మిలింద్ కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఫర్టిలైజర్ దుకాణ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ విత్తన డీలర్లు రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, నకిలీ విత్తనాలు, ఇతర మందులు అమ్మినట్లు తెలిస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయిండం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను వ్యవసాయ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈవోలు శంకర్, మానస, పరిమళ, వెంకటేష్, డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో మిలింద్ కుమార్

సెల్‌ఫోన్‌లు అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను బుధవారం బాధితులకు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ అప్పగించారు. నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.9 గ్రామానికి చెందిన సమీరం మండల్, నారాయణ మండల్, నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.12కు చెందిన జన్ను మండల్‌లు సెల్‌ఫోన్‌లు పోగొట్టుకుని ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నయీం పాల్గొన్నారు.



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఈజ్‌గాం పోలీసులు

అప్రకటిత విద్యుత్ కోతలు

- గంటల తరబడి సరఫరాలో అంతరాయం
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు



దహెగాంలో విద్యుత్ కోతలతో ఖాళీగా ఉన్న జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు

దహెగాం: విద్యుత్ సరఫరాలో కోతలు విధించడం లేదని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నంగానే ఉంది. అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండడంతో వినియోగ దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపారులు, ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు.

జిరాక్స్‌ల కోసం..

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకునేందుకు రైతులకు పాట్టాపాస్ బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ వంటివి అవసరముంటాయి. అయితే విద్యుత్ కోతల కారణంగా వారు జిరాక్స్ తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు పై తరగతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం, ఆదాయం, నివాసం, కులం తదితర సర్టిఫికెట్లు జిరాక్స్‌లు తీసుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కరెంట్ లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చి పని కాకుండానే వెనుదిరిగి వెళ్లాల్సి వస్తుందని రైతులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గంటల తరబడి కోతలు..

అప్రకటిత విద్యుత్ కోతలు గంటల తరబడి విధిస్తున్నారు. మంగళవారం సాయంత్రం సుమారు గంటకు పైగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో అవసరాల నిమిత్తం ఉదయమే మండల కేంద్రానికి ఇతర గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడ్డారు. ఆన్‌లైన్, జిరాక్స్ సెంటర్ల వద్ద కరెంట్ కోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని వాపోతున్నారు. కరెంట్ కోతల వల్ల వ్యాపారులు, ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఇన్వర్టర్ల సహాయంతో..

విద్యుత్ సరఫరాలో గంటల తరబడి అంతరాయం ఏర్పడుతున్నందున జిరాక్స్ సెంటర్లు, ఆన్‌లైన్ నిర్వాహకులు ఇన్వర్టర్లపై ఆధార పడి పనులు చేయాల్సి వస్తుంది. అయితే ఇన్వర్టర్ల బ్యాటరీలు కూడా ఎక్కువ సేపు బ్యాకప్ ఇవ్వడం లేదని, దీంతో ఖాళీగా ఉండాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. జిరాక్స్, ఆన్‌లైన్ సెంటర్లకు ప్రస్తుతం సీజన్ కావడంతో విద్యుత్ కోతల కారణంగా నష్టపోవాల్సి వస్తుందంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

గంటల తరబడి అంతరాయం



విద్యుత్ సరఫరాలో గంటల తరబడి అంతరాయం ఏర్పడుతుంది. కరెంట్ లేని కారణంగా గిరాకీ వస్తున్నా నష్టపోతున్నాం. ఇన్వర్టర్ల సహాయంతో జిరాక్స్ తీస్తున్నాం. గంటల తరబడి కరెంటు లేని కారణంగా అవి కూడా పని చేయడం లేదు. కరెంటు కోతలు లేకుండా చూడాలి. – రాపర్తి సాయి, జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు

తీవ్రంగా నష్టపోతున్నాం



విద్యుత్ కోతల కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. కరెంట్ లేకపోవడంతో నష్టపోతున్నాం. విద్యార్థులు ఆన్‌లైన్ చేయాలని వస్తున్నారు. కరెంటు లేదని చెప్పడంతో వెళ్లిపోతున్నారు. మరోవైపు షాప్‌లో ఉక్కపోత భరించలేక పోతున్నాం.

– పొన్నం అరుణ్‌కుమార్, ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడు

కోరం లేక వాయిదా

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ తెలిపారు. మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో విద్యుత్‌లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిర్వహిస్తున్నందున గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ విద్యుత్‌శాఖ ఏఈ కమలాకర్ తెలిపారు. పట్టణంలోని మీరాజ్ మసీద్, దోబీఘాట్, ఎల్‌బీఎస్ మార్కెట్ ఏరియాలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గడ్డివాము దగ్ధం

దహెగాం: మండల కేంద్రానికి చెందిన రఘోత్తం రెడ్డికి చెందిన గడ్డివాము దగ్ధమైంది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి సమీపంలో పశువుల కోసం గడ్డివాము ఉంచగా, బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూర్తిగా కాలిపోయింది. మండల కేంద్రంలో కరెంటు లేని కారణంగా కల్వాడ గ్రామం నుంచి నీళ్ల ట్యాంకర్ వచ్చే సరికి గడ్డివాము పూర్తిగా దగ్ధమైందని బాధిత రైతు వాపోయాడు.



దగ్ధమవుతున్న గడ్డివాము